కథ

ముచ్చర్ల రజనీ శకుంతల

# 'డి' ఫర్... డిఫరెంట్!

'డి' ఫర్ అనగానే అదేదో 'డి' కంపెనీ అనీ, దావూద్ మాఫియా నెట్‌వర్క్ లింక్ మార్క్ డైలీ బాంబు పేలుళ్ల సీరియల్ అని, బీభత్స రసమని, భయంతో నీరసపడిపోనక్కర్లేదు. హేపీగా 'డి' అనగానే కామెడీతో 'ఢీ' అంటూ ఎంచక్కా చదువుకునే 'డి' అనబడే దివాకరం కథ అని గమనించాలి.

'డి' అంటే దెబ్బయ్యేళ్ళక్రితం ముద్దుగా 'దివా'గా పెరిగి, పెద్దయ్యేక దివాకర్‌గా, ఇప్పుడు సెవంటీ ప్లస్ దివాకరంగారూ... అని తాత్పర్యం. అయితే ఆయన్ని తెలిసినవాళ్ళు, ఆయన గురించి తెలుసుకున్న వాళ్ళు, ఆయనకు పెట్టుకున్న పేరు 'డి' ఫర్ డిఫరెంట్... ఆ పేరెలా, ఎందుకొచ్చిందంటే కంప్యూటర్ ముందుకు వెళ్ళి మౌస్ మీద చేయేసి దివాకరం డిఫరెంట్ లీలలు డాట్‌కామ్‌లోకి వెళ్ళి, అందులోని లీలలు అన్న ఆప్షన్ మీద 'కుయ్యో, మొర్రో' అన్న కాప్షన్‌తో క్లిక్ చేస్తే...

★ ★ ★

...అదో అనగనగా కాశీమజిలీ కహానీ. అప్పటికింకా పేరు ఫిక్సవ్వలేదు. ఒరే కన్నా, చిన్నా, బన్నూ, టిన్నూ అని పిలుచుకునే టైంలో, దివాకరం బామ్మ అన్నప్రాసన బదులు వెరయిటీగా బిర్యానీ ప్రాసన చేయిస్తోన్న సిట్యుయేషన్, బుల్లి దివాకరం ముందు పెన్ను, పెన్సిలు, బుక్కూ, డబ్బులు, బంగారం గట్రా... గట్రా పెట్టి చూస్తోన్న టైంలో... బుల్లి దివాకర్, ద్వాపరయుగంలోని శ్రీకృష్ణుడికి మల్లె పాక్కుంటూ వెళ్ళి... వెళ్ళి... ఇంటెదురుగా వున్న మందుల కొట్లో దూరి, మందుల మధ్య సెటిలై వాటితో ట్వంటీ ప్లస్ క్రికెట్, ప్లస్ వాలీబాల్ ప్లస్ షటిల్ ఆడుకుంటున్నాడు.

అప్పటికింకా బేబీస్ డే ఔట్ సినిమా రాలేదు. ఈ సీన్ మన తెలుగు ప్రొడ్యూసర్‌గానీ, డైరెక్టర్‌గానీ చూసి వుంటే వెంటనే హాలీవుడ్ వాడికి చెప్పేసి, వాళ్ళు హాలీవుడ్‌లో సినిమా తీసేసేక, దాన్ని బాలీవుడ్, తమిళ్‌వుడ్ కొట్టేసేక, వాళ్ళ దగ్గర కోట్లు గుమ్మరించి తెలుగులో తీసేసి 'గ్రేట్ రీమేక్' అని పబ్లిసిటీ మేకులు కొట్టుకునేవాళ్ళు. అలా బిర్యానీ ప్రాసన రోజే మందుల మధ్య మహావిష్ణువు పాల సముద్రంలో ఫిక్సయిపోయినట్టు సెటిలయ్యాడు. అదిగో అప్పుడు వాళ్ళ బామ్మకు లైట్‌గా సన్‌స్ట్రోక్ బదులు మనవడి స్ట్రోక్ వచ్చింది.

★ ★ ★

చిన్నప్పుడంతా స్కూల్‌కు వెళ్తూ హాస్పిటల్స్‌ని, డాక్టర్స్‌నీ అదేపనిగా చూస్తోంటే 'బుల్లి వెధవకు డాక్టరై తెల్లకోటు వేసుకోవాలని వుంది గామోసు' అనుకున్నారంతా. అదే విషయం అడిగితే... "నేను డాక్టర్‌ని అవ్వను. డాక్టర్ దగ్గర ట్రీట్‌మెంట్ తీసుకుంటాను. అదేంటో నాకు డాక్టర్ల దగ్గర, హాస్పిటల్‌లో, మందుల షాపుల్లో హాయిగా వుంటుందని చెప్పేవాడు. అప్పుడే బామ్మ బాల్చీని షాక్‌తో తన్నేసి, గోడమీద ఫోటోగా ఫిక్సయి లేట్ బామ్మ అయింది.

★ ★ ★

పక్కూళ్ళో వర్షం పడుతుందంటే, ఆ వూరికి వెళ్ళి మరీ తడిచొచ్చేవాడు. వర్షమంటే అంతిష్టమా అంటే 'కాదూ... హచ్... వర్షంలో తడిస్తే హచ్... ఎంచక్కా డాక్టర్ అంకుల్ దగ్గరకి వెళ్ళొచ్చు... హచ్..' అనేవాడు. అంతా తూచ్ అని వీపులు చరుచుకునే వాళ్ళు. దివాకరానికి జ్వరమంటే సంతోషం. జలుబు చేస్తే హ్యాపీ. మందులు ఆర్ ది సీక్రేట్ ఆఫ్ మై ఎనర్జీ అనే మనిషిగా ఎదిగాడు.

★ ★ ★

పెళ్ళి చూపుల్లో నీకు వంటొచ్చా? కాకరకాయ ఫ్రై చేయడం వచ్చా... అని అడగలేదు దివాకరం. మీకు నోవాలిజిన్ గురించి తెలుసా? డల్‌కొలెక్స్ గురించి ఐడియా వుందా? బెనడ్రిల్ దేనికి వాడతారు? మనిషిలో ఎన్ని రకాల జబ్బులు వుంటాయో తెలుసా... లాంటి ప్రశ్నలు అడిగాడు. హెల్త్ కాన్షియస్‌నెస్ ఎక్కువేమో నా బిడ్డ పాయింట్ పర్సెంట్ ఒళ్ళు వేడి చేసినా భరించలేడేమో బాగా చూసుకుంటాడులే అని ఫీలై అతనికిచ్చి పెళ్ళి జరిపించేసారు అమ్మాయి తరుపు వాళ్ళు.

ఫస్ట్‌నైట్ పాలగ్లాసు బదులు గ్లూకోజ్ వాటర్ భార్య చేతికిచ్చి తనకిమ్మన్నాడు. ఫ్రూట్స్ ప్లేస్‌లో విటమిన్ టాబ్లెట్ పెట్టాడు.

జనమంతా భక్తి భావంతో రోజుకో గుడికి వెళ్తారు. శనివారం వెంకటేశ్వరస్వామి కోవెలకు, గురువారం సాయి, శుక్రవారం సంతోషిమాత... కానీ దివాకరం రోజుకో స్పెషలిస్టుని కలుస్తాడు. ఓరోజు కార్డియాలజిస్ట్, మరోరోజు డెంటిస్ట్, ఇంకోరోజు యూరాలజిస్ట్... చివరాఖరికి ఓ రోజు ఎవర్ని కలవాలా అని ఆలోచించి... చించి... గైనకాలజిస్ట్‌ని కలిసాడు.

"మీకు నాతో పనేమిటి?" అడిగింది గైనకాలజిస్ట్.

"నాకేమైనా గైనిక్ ప్రాబ్లెమ్ వుందేమో... ఊర్కే.. ఉత్తుత్తిగా చెక్ చేస్తారేమోనని" అన్న దివాకరం మాటలు విని.. ఆ గైనకాలజిస్ట్ గజగజ వణికి కెవ్వు కెవ్వుమంటూ కేకలు వేసింది. ఆ కేకలకు నర్సింగ్ స్టాఫ్ వాళ్ళొచ్చి దివాకరాన్ని గెంటేశారు.

★ ★ ★

ఇప్పుడు మెయిన్ మెనూలోకి వెళ్ళి లేటెస్ట్ యిష్యూలోకి వస్తే... దివాకరానికి ఇద్దరు కొడుకులు, ఇద్దరు కూతుళ్ళు. వాళ్ళంతా సిటీలోనే వుంటారు. మిసెస్ దివాకరం లైఫ్‌కార్డ్ మధ్యలో మిడిల్ డ్రాప్ అయింది. దివాకరం ముందు పెద్ద కొడుకు దగ్గర వున్నాడు. పొద్దున్నే కొడుకు ఆఫీసుకు వెళ్ళగానే కోడల్ని పిలిచి... ఆరోగ్యకుశలాలు అడిగి... ఏ జబ్బు చేస్తే ఏ మెడిసిన్ వాడాలో చెప్పేవాడు. తరచూ డాక్టర్‌ని మీట్ అవ్వాలని బోధించేవాడు. రామాయణం, మహాభారతం... చదవాల్సిన వయసులో మెడికల్ జర్నల్స్ తిరగేసేవాడు. దాంతో మీ నాన్నను 'బేర్' చేయడం నావల్ల కాదు అంటూ బేర్‌మంది.

"భస్... మందులకీ.. మెడికల్ జర్నల్స్‌కీ గౌరవం లేని ఇంట్లో నేనుండను" అంటూ రెండో కొడుకు ఇంటికి షిఫ్ట్ అయ్యాడు.

★ ★ ★

పొద్దున్నే మార్నింగ్ వాక్‌కు వెళ్ళే బదులు, ఆ వీధి చివరవుండే డాక్టర్ దగ్గరకి వెళ్ళి తనకేమైనా హెల్త్ ప్రాబ్లెమ్స్ వున్నాయా... అంటూ వాకబు చేసేవాడు. మధ్యాహ్నం చిన్న కునుకు తీయడం మాని, స్వంత మందులు తయారు చేసుకోవడం మొదలుపెట్టేవాడు. రాత్రి పూట మనవళ్ళను ఒళ్ళో కూచోపెట్టుకుని జబ్బులు- వాటి లక్షణాల గురించి కాశీమజిలీ కథల్లా చెప్పేవాడు. దాంతో చిన్న కోడలు మొగుడ్ని గోకింది. ఆ గోకడం చూసిన దివాకరం వెంటనే తల గోక్కుని కోపంగా కూతురింటికి షిఫ్ట్ అయ్యాడు.

★ ★ ★

కూతురింట్లో...

పొద్దున్నే తండ్రికోసం కాఫీ కలిపి తెచ్చిచ్చింది. కాఫీ బదులు నిమ్మకాయ, తేనె గోరువెచ్చని నీటితో తాగాలని క్లాసు పీకడమే కాకుండా, రోజూ పొద్దున్నే నిమ్మరసం తాగమని ఇంటిల్లిపాదికి చెప్పాడు. దానివలన లాభాలు గంటసేపు చెప్పాడు. దాంతో పిల్లలు స్కూల్ టైం అయిపోయింది, అల్లుడి ఆఫీసు టైం దాటింది. అల్లుడికి ఒళ్ళు మండింది. "నీకు డైవోర్సు కావాలా?" అని అడిగేడు భార్యని.


ఆ మాట బిబిసికన్నా ఫాస్ట్‌గా దివాకరాన్ని చేరి, లగేజ్ సర్దుకోకుండానే అలిగి, అట్నుంచి అటే చిన్న కూతురింటికీ్కూడా వెళ్ళకుండా ఓల్డేజ్ హోమ్‌లో చేరిపోయాడు.


★ ★ ★

దివాకరం వార్డ్‌రోబ్‌లో ప్రిస్క్రిప్షన్స్ మన రాష్ట్రం అప్పుల్లా గుట్టలా పేరుకుపోయాయి. సూట్‌కేసుల్లో వందంలే మందులు... తలకింద దిండు బదులు మెడికల్ జర్నల్స్.




ఒక్కమాటలో చెప్పాలంటే ఒక డాక్టర్ స్కానింగ్ చేసి చెప్పే విషయాలను దివాకరం స్కానింగ్ చేయకుండానే చెప్పగలడు. అంత నాలెడ్జీ సంపాదించాడు. అతను కనిపిస్తే చాలు డాక్టర్లలో ఓ రకమైన బెదురు. వాళ్ళకే తెలియని విషయాలను అనర్గళంగా చెప్పగలడు. తనకు తానే ఇంజెక్షన్ చేసుకోగలడు. తన పెన్షన్‌లో తొంభై శాతం మందులకు, స్కానింగ్‌లకు ఖర్చు చేసే కెపాసిటీ దివాకరానికి వుంది.




ఓల్డేజ్ హోమ్‌లో వున్న దివాకరానికి 'న్యూ' థాట్స్ వస్తూనే వున్నాయి. జలుబు చేస్తే స్కానింగ్, జ్వరమొస్తే టోటల్ హెల్త్ చెకప్, తలనొప్పి వస్తే ఎమ్.ఆర్.ఐ... ఇలా టెస్ట్‌ల మీద టెస్ట్‌లు చేయించుకుంటున్న దివాకరానికి కొత్త అయిడియా ఒకటొచ్చింది.

బోర్ కొడుతుందని, తలనొప్పి మాత్రలు నములుతూ, 'ఒక గుండె సవ్వడి' నవల చదువుతోన్న దివాకరానికి ఓ ఐడియా ఫ్లాష్‌లా వెలిగింది. అందులో హీరోయిన్ గుండె మరో హీరోయిన్‌కు మారుస్తారు. ఓ చిన్న ఫ్లాష్‌బ్యాక్‌లో లైట్‌గా హార్ట్ స్ట్రోక్ వచ్చిన దివాకరాన్ని హాస్పిటల్‌కు తీసుకువెళ్ళినప్పుడు... ఇది నార్మలే... ఎక్కువగా మాట్లాడకూడదు.. అన్జెప్పి డాక్టర్ రౌండ్స్‌కు వెళ్ళాడు. దివాకరం డాక్టర్ చెప్పిన విషయాన్ని ప్రతి వార్డ్‌కు వెళ్ళి అడిగినవారికి, అడగని వారికి చెప్పి, హార్ట్ స్ట్రోక్ వస్తే మాట్లాడకుండా రెస్ట్ తీసుకోవాలన్నమాట... అని చెప్పొచ్చాడు. పైగా నాకేమైనా స్టంటు వేస్తారా? అని అదేదో కారు టైరుకు పంక్చర్ వేస్తారా? అన్నంత ఈజీగా అడిగాడు. అట్లాంటి దివాకరానికి ఎందుకో తన గుండె ఓల్డ్ అయ్యిందని, గుండె మార్చుకోవాలని అనిపించింది. వెంటనే కార్డియాలజిస్ట్‌ని సంప్రదించాడు.

కార్డియాలజిస్ట్ షాకయ్యాడు. "అది నవలండీ..." అన్నాడు.

ఆ నవల్లో రాసినట్టే ఈ మధ్యే గుండెను యాజిటీజ్‌గా మార్చేయొచ్చని వార్త వచ్చిందంటూ దాని తాలూకూ క్లిప్పింగులు చూపించాడు.

పైగా... తనకో కోరిక వుందని చెప్పాడు. అదేమిటంటే.. "మీరు ఎనస్థీషియా ఇవ్వకుండా నా బాడీని ఓపెన్ చేసి గుండె మారుస్తుంటే నేనేమో నా బాడీలోని కిడ్నీలు, లివర్, ఎంట్రెయిల్స్‌ను చూస్తూంటాను. అలాగే సర్జరీ అంతా షూట్ చేయిద్దాం" అంటూ ఓ లిస్ట్ ఏకరవు పెట్టాడు. అప్పటికే కార్డియాలజిస్ట్ కోమాలోకి వెళ్ళిపోయినట్టు ఉండిపోయాడు.

★ ★ ★

అప్పటికే ఓల్డేజ్ హోమ్‌లోని బామ్మలకు, తాతయ్యలకు మెడిసినోపదేశం చేసాడు. వాళ్ళకూ ఈ ఫోబియా అంటుకుంటుంది. దివాకరం గురించి ఆ నోటా ఈ నోటా బిబిసిదాకా వెళ్ళింది దివాకరం స్పెషాల్టీ. ప్రపంచంలో అత్యధిక డాక్టర్లను కన్సల్ట్ చేసిన వ్యక్తిగా, ప్రపంచంలోని అత్యధిక మందుల పేర్లు, వాటి తయారీ వివరాలు... అందులో ఉపయోగించిన ఫార్ములాలు తెలిసిన వ్యక్తిగా, నోటి చివర కనీసం వెయ్యిమంది డాక్టర్ల పేర్లను, ఫోన్ నెంబర్లతో సహా చెప్పే వ్యక్తిగా, దాదాపు డెబ్బయి శాతం వ్యాధులకు, వ్యాధివున్నా లేకపోయినా ట్రీట్‌మెంట్ చేయించుకున్న శాల్తీగా వరల్డ్ బుక్ ఆఫ్ గిన్నీస్‌లో స్థానం సంపాదించుకున్నాడు. ఆరోజు అతనికి సన్మానం చేసేక, గిన్నీస్ బుక్ వాళ్ళకు తన కోరిక చెప్పాడు. తను చూస్తుండగానే తన శరీరానికి సర్జరీ చేయాలని, అక్కడితో ఆగిపోకుండా... ఎందుకో తనకీమధ్య ఆపరేషన్లు చేయాలను వుందంటూ, గిన్నీస్ బుక్ నిర్వాహకుల వైపు చూసాడు. వాళ్ళూ సినిమాలోలా ధన్‌మని మాయమైపోయారు.

**(అతి శుభ్రం ఎలాంటి ఫోబియానో, తరచూ ఏదైనా అనారోగ్యమేమోనని డాక్టర్లను సంప్రదించడం, అలాగే మందులు వాడ్డమూ ఓ ఫోబియానే... జాగ్రత్త.. అని చెప్పాలనే ఈ కథ -రచయిత్రి)**

☆

## నటిస్తేనే పాడతా!

మమతా మోహన్‌దాస్ గాయని కమ్ నటి అని అందరికీ తెలుసు. రాఖీ రాఖీ, ముప్పయ్యారు ఇరవైయ్యారు, ఆకలేస్తే అన్నం పెడతా... లాంటి హిట్ సాంగ్స్ పాడిందామె. హస్కీ వాయిస్‌తో ఎక్కువగా ఐటమ్ నంబర్లు పాడే మమతా ఇకపై తను నటించే సినిమాలో మాత్రమే పాడతానంటోంది. తను నటించకపోయినా ఆ సినిమాలో పాటలు పాడమని అడిగేవారికి కాస్త నిరుత్సాం కలిగించే మాట ఇది కదా! హీరోయిన్‌గా బిజీ అవుతున్నందునే ఈ నిర్ణయమట.

